క్లుప్తంగా

రేపు లింగంగుంట్లలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో పెదకూరపాడు మండలం లింగంగుంట్లలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ తెలిపారు. సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ, న్యూరో సర్జన్ డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, సీనియర్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ విజయబాబు ఆధ్వర్యంలో కంటి, మెదడు వ్యాధులకు పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మెదడు, నరాల సమస్యలు, పక్షవాతం, తలనొప్పి, తూలుడు, ఫిట్స్, చిన్న వయస్సులో వచ్చే నరాల సమస్యలు, నడుము నొప్పి, వెన్ను నొప్పి, న్యూరోపతి సమస్యలు, కంటి శుక్లాలు ఉన్నవారు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని ఆయన సూచించారు. అవసరమైన వారికి, కంటి శుక్లాలు ఉన్నవారికి ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా లలితా హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్ చేస్తారని వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు



నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ 6వ లైనులో అయిసెట్టి సీతారామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంబరాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భారీ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ అయిసెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రంగనాయకి, గోదాదేవి సహిత రంగనాథస్వామి విగ్రహం ఊరేగింపు అనంతరం లడ్డూ వేలం పాట ఉంటుందని చెప్పారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: పట్ట పగలు ఇంటి ముందు ద్విచక్ర వాహనం చోరీపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. హనుమాన్ నగర్ 2వ లైన్‌కు చెందిన మాదాల సురేస్ సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తాడు. ఈనెల 15న ఇంటి ముందు ద్విచక్ర వాహనం పార్కింగ్ చేశాడు. మరలా 11 గంటలకు బయటకు వచ్చి చూసే సరికి కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల వీధుల్లో, బస్టాండ్, రైల్వే స్టేషన్ సమీప ప్రాంతాలలో వెతికినా వాహనం కనిపించలేదు, దీంతో శుక్రవారం నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమిత్‌షా పర్యటనను వ్యతిరేకిస్తూ రేపు నిరసనలు

లక్ష్మీపురం: అంబేడ్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్ఠాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ ఆదివారం జిల్లాలోని అన్ని ప్రాంతాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అమిత్‌షా వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు, నిరసనలు వెల్లువెత్తినా బీజేపీ వైఖరిలో మార్పులేదని తెలిపారు.

ఈ పంట నమోదు చేసుకోవాలి



పొన్నూరు: మండలంలోని దండమూడి, మునిపల్లె గ్రామాలలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర, వరి పంటలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏఓ డేగల వెంకట్రామయ్య మాట్లాడుతూ మొక్కజొన్న, జొన్నలో కాండం తొలుచు పురుగు సస్యరక్షణ చర్యలు వివరించారు. మినుము, పెసర పంటలలో ముఖ్యమైన పోషకాలు పిచికారీ రూపంలో అందించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని తెలియజేశారు. రబీ సీజన్‌లో వేసిన అన్ని పంటలకు ఈ పంట నమోదు చేసుకోవాలని, ఈ కేవైసీ కూడా తప్పనిసరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది అరుణ నాగరాజా, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో అ'ధర'హో !

- వ్యాపారస్తుల దోపిడీ
- ఎమ్మార్పీ ఉండదు.. ఎక్స్‌పెర్టీ కనపడదు
- ఉన్నతాధికారులకు ప్రయాణికులు చెప్పినా చర్యలు శూన్యం
- పోలీసులు, కంట్రోలర్ కనుసన్నల్లోనే వ్యాపారుల దందా
- షాపుల పర్యవేక్షించే అధికారికి మామూళ్లు ?
- లబోదిబోమంటున్న ప్రయాణికులు



గుంటూరు ఆర్టీసీ బస్టాండ్



ధర, వివరాలు లేకుండా విక్రయిస్తున్న చిప్స్ ప్యాకెట్

సార్ నమస్కారం !

ఆర్టీసీ బస్సులో ప్రయాణించే సామాన్య ప్రయాణికుడిని... కుటుంబంతో కలిసి సంక్రాంతి పండుగకు ఇంటికి వచ్చి.. తిరిగి ఉద్యోగం నిమిత్తం వెళుతున్నా.. నా బిడ్డలు బస్టాండ్‌లో బస్సు ఆగగానే తినేందుకు ఏమైనా.. తాగేందుకు మజా బాటిల్ అడిగారు.. చిప్స్ ప్యాకెట్ కొంటే.. దానిపై ఎమ్మార్పీ లేదు. ఎక్స్‌పెర్టీ కనపడలా.. ఇదేమంటే అదంతే అంటున్నారు. రేటు కూడా బయట పది రూపాయలు విలువ చేసే ప్యాకెట్లు... రూ 40 తీసుకుంటున్నారు... సరే కదా అని కూల్‌డ్రింక్‌కు వెళితే.. రూ 40 ఉన్న ఎమ్మార్పీ రూ 60 అడుగుతున్నారు.. పిల్లలకు రెండు చిప్స్..రెండు కూల్ డ్రింక్‌లు కొంటే.. వాటి విలువ రూ 200 నిట్టనిలువునా తీసుకున్నారు. సామాన్యుడుపై పెనుభారాన్ని మోపుతున్నారు.. పక్కనే ఉన్న కంట్రోలర్‌లు చూసీ చూడనట్లు వెళ్లిపోతున్నారు.. ఇదేమని ప్రశ్నిస్తే.. అక్కడే ఉన్న పోలీసు అధికారులు మా ఫోటోలు తీస్తున్నారు.. ఆర్టీసీని నమ్ముకుని ప్రయాణించే వారికి మీరిచ్చే గౌరవం ఇదేనా..? ప్రజలకు చేరువ అవటం అంటే ఇలాగే..? నిత్యం పర్యవేక్షణ ఈ విధంగానే ఉంటుందా..?

చిప్స్ దుర్వాసన

కొనుగోలు చేసిన చిప్స్ భరించలేని దుర్వాసన వస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోరా? నష్టాల్లో ఉన్న ఆర్టీసీ ఊతమిచ్చే ప్రయాణీకుడిని నేను.. మాకు నష్టం జరిగితే.. మీరెందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు ? ఆ షాపుల వారు బహిరంగంగానే ఫిర్యాదు చేసుకో పొండి అంటూ అవమానకరంగా మాట్లాడుతున్నారు. అధికారులకు మేము నెలవారీ ఇస్తున్నామని బాహటంగానే చెబుతున్నారు. ఇదే నిజమని నా అంతరాత్మ చెబుతోంది.. అందుకే ఎన్ని ఫిర్యాదుల అందినా.. అధిక రేట్లుకు విక్రయాలు జరుపుతున్నా.. మీన మేషాలు లెక్కిస్తుండటంపై అనుమానం కలుగుతోంది.

నిమ్మ సోడా కూడా కల్తీ మయం

ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న 100 దుకాణాల్లో తినుబండారాలు, కూల్‌డ్రింక్ షాపులు 40 వరకు ఉన్నాయి. ప్రతి షాపులోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఆఖరికి నిమ్మ సోడా కూడా కల్తీ మయం చేస్తున్నారు. సాక్రిన్.. నిమ్మ ఉప్పుతో సోడాలు అమ్మేస్తున్నారు. దాహం వేసి తీరు తాగేందుకు వెళితే.. బస్టాండ్‌లో వాటర్ కనపడదు. మినరల్ వాటర్ కూడా అరలీటర్ రూ. 4 తీసుకుంటున్నారు.. హోటల్‌లో టిఫిన్ తిందామంటే.. నాణ్యత కనిపించడం లేదు. ఆర్టీసీ ఆదాయానికే ప్రాధాన్యతనిచ్చే మీరు.. ప్రయాణికుల సమస్యలపై కూడా దృష్టి సారించాలి. అధిక రేట్లు.. కాలపరిమితి లేని వస్తువుల విక్రయాలు నిలువరించాల్సిన అవసరం ఉంది. మీరు పట్టించుకోకపోవటంతో దుకాణ యజమానులు మరింత పేట్రేగిపోతున్నారు. అదీ ఆర్టీసీకే అప్రదిష్ట అనే విషయాన్ని కూడా గుర్తించాలి.

కొంచెం కంట్రోల్ చేయండి సార్...

ఆర్టీసీ బస్టాండ్‌లో ముఖ్యంగా నాకు దుకాణదారుల కంటే మీ కంట్రోలర్ల ప్రవర్తనే ఇబ్బందికరంగా అనిపించింది. షాపులో దుకాణదారుడు అధిక రేట్లు విక్రయాస్తున్నాడని నేను అడుగుతుంటే.. అతనిపై చర్యలు తీసుకోకుండా.. నాకు సర్దిచెప్పే ప్రయత్నం చేయడం విస్మయానికి గురి చేసింది. కనీసం మా సమస్య కూడా వినకుండా.. సర్లే ఇవన్నీ రోజు ఉండేవేలే... ఇక వెళ్ళండి అంటూ.. అక్కడ నుండి పంపించి వేస్తున్నారు. దీనిపైన కూడా మీరు దృష్టి పెట్టాలి సార్. ఈ విషయాన్ని గతంలోనే మీ దృష్టికి తీసుకుని వచ్చాం. అయినప్పటికీ మీరు కూడా ఉదాసీనంగా వ్యవహరిస్తున్న పరిస్థితులు తారసపడుతున్నాయి. ఇప్పటికైనా మీరు స్పందించి అధిక రేట్లు, కాలపరిమితి లేకుండా విక్రయిస్తున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవాలి .

ఇట్లు
ఓ మధ్యతరగతి ప్రయాణికుడు.
– పట్నంబజారు

చర్యలు తీసుకుంటాం

ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తూనే ఉన్నాం. ఇప్పటికే 50కి పైగా జరిమానాలు విధించాం. అయినప్పటికీ వ్యాపారుల తీరులో మార్పు రావడం లేదు. ప్రయాణికుల ఫిర్యాదు మేరకు ప్రత్యేక తనిఖీలు చేపడతాం. దీనిలో ముఖ్య పాత్ర ఆర్టీసీ అధికారులపై ఉంటుంది. ఈ క్రమంలో వారు అధిక చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

–షాలేమ్‌రాజు
(లీగల్ అండ్ మెట్రాలజీ, డీసీ)

దాడులు నిర్వహిస్తాం

ఆర్టీసీ బస్టాండ్‌లో నాసిరకం వస్తువులు విక్రయాలపై పలు ఫిర్యాదులు అందాయి. త్వరలోనే ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం. కచ్చితంగా నాణ్యత, శుభ్రత, నాసిరకం లేని వస్తువులు అమ్మితే చర్యలు తీసుకోవడంతో పాటు కేసు నమోదు చేస్తాం. కచ్చితంగా ప్రతి ఒక్కరూ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలి. లేకుంటే చర్యలు తప్పవు.

–జి. పూర్ణచంద్రరావు (స్టేట్ ఫుడ్ జాయింట్ కంట్రోల్ ఇన్‌చార్జి)

జరిమానాలు విధిస్తాం

దుకాణదారులకు ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు, జరిమానాలు కూడా విధించాం. కచ్చితంగా అధిక రేట్ల విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ప్రయాణికులకు ఇబ్బంది కలగనివ్వం. అధిక రేట్లు వసూలు చేస్తే ప్రయాణికులు నేరుగా దృష్టికి తీసుకు రావచ్చు. తనిఖీలు నిర్వహించి, చర్యలు తీసుకుంటాం.

– ఎం. రవికాంత్ (ఆర్టీసీ, ఆర్ఎం)

న్యాయం పక్షాన నిలబడండి !

న్యాయవాదులకు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పిలుపు

పట్నంబజారు: రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలపై జరుగుతున్న న్యాయ పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు సిద్ధంగా ఉండాలని శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా లీగల్ విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన, ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ రోళ్ల మాధవి చంద్రమౌళీనగర్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఆమెను దుశ్శాలువ, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు పోలూరి వెంకటరెడ్డి, పార్టీ లీగల్ సెల్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్, గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, సోమసాని ఝాన్సీలక్ష్మి, కళ్లం రమణారెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, కోటి, శ్రీనివాసరెడ్డి, మొండితోక శ్రీనివాసరావు, కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, కె.ఎస్.టి.సింగ్, గౌతమి, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), పడాల సుబ్బారెడ్డి, దూపాటి వంశీ, పార్టీ నేత గోళ్ల శివశంకర్ యాదవ్ పాల్గొన్నారు.



మాధవిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, పార్టీ నేతలు

వృద్ధుడు అదృశ్యం

లక్ష్మీపురం: మతిస్థిమితం లేని వృద్ధుడి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. శ్రీనివాసరావుపేట 6వ లైన్ ప్రాంతానికి చెందిన దరిమడుగు కోటేశ్వరరావు (59) గతంలో కోల్డ్‌స్టోరేజీలో పని చేసుకుంటూ జీవనం సాగించాడు. భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. కొంత కాలంగా మతిస్థిమితం సక్రమంగా లేక పోవడంతో ఇంటి వద్దనే ఉంటూ చికిత్స పొందుతున్నాడు. ఈనెల 14 న ఇంటి నుంచి సైకిల్‌పై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధు మిత్రుల వద్ద విచారించినా జాడ కానరాలేదు. దీంతో భార్య నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు లింగంగుంట్లలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో పెదకూరపాడు మండలం లింగంగుంట్లలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ తెలిపారు. సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ, న్యూరో సర్జన్ డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, సీనియర్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ విజయబాబు ఆధ్వర్యంలో కంటి, మెదడు వ్యాధులకు పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మెదడు, నరాల సమస్యలు, పక్షవాతం, తలనొప్పి, తూలుడు, ఫిట్స్, చిన్న వయస్సులో వచ్చే నరాల సమస్యలు, నడుము నొప్పి, వెన్నునొప్పి, న్యూరోపతి సమస్యలు, కంటి శుక్లాలు ఉన్నవారు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని ఆయన సూచించారు. అవసరమైన వారికి, కంటి శుక్లాలు ఉన్నవారికి ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా లలితా హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్ చేస్తారని వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు ప్రారంభం



విద్యాసాగర్‌కు ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారం అందజేత



నాటికలోని ఓ దృశ్యం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై శుక్రవారం ఎన్టీఆర్ కళాపరిషత్ 20వ నాటకోత్సవాలు ప్రారంభమయ్యాయి. కె.ఆర్ కె.ఈవెంట్ ఆధ్వర్యంలో నాటకోత్సవాలు జరగ్గా, సభకు పరిషత్ గౌరవ అధ్యక్షుడు అంబటి మధుమోహన్ కృష్ణ అధ్యక్షత వహించారు. ప్రారంభోత్సవ సదస్సులో ఎన్.ఆర్.ఐ విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిడి తిలక్‌బాబు, సాహితీవేత్త డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, తెనాలి ఏ.ఎస్.ఎన్.డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొలసాని రామ్‌చంద్, సంస్థ కన్వీనర్ కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్, బొప్పన నరసింహారావు (బుజ్జి), జి. మల్లికార్జునరావు మాట్లాడారు. అనంతరం వీవీఐటీ విద్యా సంస్థల అధినేత వాసిరెడ్డి విద్యాసాగర్‌కు ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారం అందించి సత్కరించారు. సభానంతరం తెలుగు కళా సమితి (విశాఖపట్నం) పి.టి.మాధవన్ రచనకు, చలసాని కృష్ణప్రసాద్ దర్శకత్వం వహించిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత ?' నాటిక, అభినయ ఆర్ట్స్ (గుంటూరు) స్నిగ్ధ రచనకు ఎస్.రవీంద్రారెడ్డి దర్శకత్వం వహించిన 'ఇంద్రప్రస్థం' నాటికను ప్రదర్శించారు. నాటికలు సభికులను, ప్రేక్షకులను అలరించాయి.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో మాట్లాడుతున్న సీపీఐ నేతలు

లక్ష్మీపురం: ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. గుంటూరు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి సహకారంతో సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక శారదా కాలనీ మామిళ్లపల్లి మాలకొండయ్య స్తూపం వద్ద నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని సీపీఐ 48వ డివిజన్ కార్యదర్శి ఇరిగినేని వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, చల్లా మరియదాసు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, 51 డివిజన్ సీపీఐ కార్యదర్శి దండు రవి పాల్గొన్నారు.

'సచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్'ను విజయవంతం చేయాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో సమావేశమైన కమిషనర్

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతి నెలా 3వ శనివారం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌ను విజయవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు నోడల్ అధికారులను ఆదేశించారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కలిగించాలని ఆయన తెలిపారు. కార్యక్రమాలకు ప్రొటోకాల్ మేరకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని చెప్పారు.

శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాల నిర్వహణపై నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దేశంలో అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడానికి 12 నెలలకు 12 థీమ్‌లతో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రూపొందించారని తెలిపారు. అందులో భాగంగా శనివారం న్యూ ఇయర్ – క్లీన్ స్టార్ట్ థీమ్‌తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడానికి కార్యాచరణ సిద్ధం చేశామని చెప్పారు. శనివారం జిల్లా కలెక్టరేట్ నుంచి హిందూ కాలేజీ సిగ్నల్ జంక్షన్ వరకు స్వచ్ఛత ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ చేపడతామని వివరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ సలహాలు అవసరం

నగరాభివృద్ధికి సీనియర్ సిటిజన్స్ సూచనలు, సలహాలు ఎంతో దోహదపడతాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సీనియర్ సిటిజన్స్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ వివిధ రంగాలలో ఎంతో అనుభవం సాధించి ఉంటారని, వారి సూచనలు, సలహాలు నగరాభివృద్ధికి ఎంతగానో అవసరమని తెలిపారు.

సీనియర్ సిటిజన్స్, నగరపాలక సంస్థ అధికారులతో ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని, అందులో అభిప్రాయాల్ని పోస్ట్ చేయవచ్చని తెలిపారు. నగరంలో ప్రధానంగా వార్డు అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేయాలని, సుదీర్ఘ కాలం నుంచి అసంపూర్తిగా ఉన్న నార్ల ఆడిటోరియం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సీనియర్ సిటిజన్స్ కమిషనర్‌కు సూచించారు.గోరంట్ల కొండపై రిజర్వాయర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, తాగు నీటి రిజర్వాయర్ల వద్ద వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. శంకర విలాస్ వద్ద ఆర్‌ఓబీ నిర్మాణ పనులు ప్రారంభానికి ముందే రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలతో ప్రమాదాలకు చెక్

ఆర్టీఓ బి.సత్యనారాయణ ప్రసాద్



ఆర్టీవో సత్యనారాయణ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఆర్ఎం రవికాంత్

పట్నంబజారు: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఆర్టీఓ బి.సత్యనారాయణ ప్రసాద్ చెప్పారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీఎస్ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో సత్యనారాయణప్రసాద్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరికీ ఏకాగ్రత ఎంతో ముఖ్యమని తెలిపారు. మద్యం తాగడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మలుపు వద్ద అతివేగం ప్రమాదాలకు కారణమవుతాయన్న విషయం గుర్తించాలని చెప్పారు. సర్వీసు రోడ్లను వాహనదారులు పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఉండదని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు సీనియర్ల ద్వారా డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మానవ తప్పిదాల కారణంగానే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీఏ కార్యాలయంలో..

స్వర్ణభారతీనగర్‌లోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు ఆర్టీవో బి.సత్యనారాయణప్రసాద్, ఎంవీఐలు బి.గోపాల్, మల్లేశ్వరి, సౌజన్య, ఏఎంవీఐ సంధ్య రక్షణ గురించి వివరించారు.హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణానికి రక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీవోలు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా పీడీఎఫ్ అభ్యర్థినే ఎన్నుకోవాలి



ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: రాజకీయాలకు అతీతంగా ప్రజల పక్షాన నిలిచి, శాసనమండలి వేదికగా సమస్యలపై గళం వినిపించగల పీడీఎఫ్ అభ్యర్థినే ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని యూటీఎఫ్ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం. కళాధర్, కె.శ్రీనివాసరెడ్డి, ఎం. మోహన్‌రావు, జె. వినయ్, ఎం. వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం కృష్ణా–గుంటూరు శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా కేఎస్ లక్ష్మణరావును తిరిగి గెలిపించుకోవాలని కోరుతూ ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చిలో జరగనున్న ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో నిరుద్యోగ, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ సంఘాలు బలపర్చిన అభ్యర్థి విజయం ప్రజాస్వామ్య పరిరక్షణకు కీలకమని తెలిపారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫోరం (పీడీఎఫ్) తరపున ఎమ్మెల్సీగా గెలిచిన తాము ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నామని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, నిరుద్యోగులతో పాటు సమాజంలోని అన్ని వర్గాల హక్కుల పరిరక్షణ, సాధన కోసం శాసనమండలిలో గళం వినిపించగల సామర్థ్యం పీడీఎఫ్ అభ్యర్థులకు ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గుంటూరు జిల్లా సహాధ్యక్షురాలు వై. నాగమణి పాల్గొన్నారు.

ఉరుసు మహోత్సవం ప్రారంభం



బాబా సమాధి వద్ద భక్తుల ప్రార్థనలు



విద్యుదీపాలంకరణతో దర్గా

నగరంపాలెం: స్థానిక హజరత్ కాలే మస్తాన్ షావలి దర్గాలో శుక్రవారం ఉరుసు మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. దర్గాను విద్యుదీపాలంకరణతో సుందరంగా అలకరించారు. ఐదు రోజుల పాటు జరగనున్న మహోత్సవం బాబా చాందినితో మొదలైంది. భారీ సంఖ్యలో భక్తులు బాబా వారిని దర్శించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ధర్మకర్త రావి రామ్మోహన్‌రావు తెలిపారు. రాత్రికి గంధోత్సవం, నగర ఊరేగింపు నిర్వహించారు.

తిరుపతిలో తొక్కిసలాట బాధాకరం



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత అధికారి భావన్నారాయణ

లక్ష్మీపురం: వైకుంఠ పర్వదిన సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మరణించడం బాధాకరమని విశ్రాంత అధికారి పి.భావన్నారాయణ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యక్ష దైవాన్ని భక్తుడు కనులారా చూసే వెసులుబాటును పెంచాలని కోరారు. లఘు దర్శనాల పేరిట సామాన్య భక్తులకి ఒక రకమైన దర్శనం, ఘనంగా చెల్లించుకునే వారికి మరొక రకమైన దర్శనం ఎంతవరకు సమంజసమో ? పాలకులు, టీటీడీ అధికారులు ఆలోచించాలని ఆయన సూచించారు. ఈ సంఘటనను హెచ్చరికగా తీసుకొని ప్రభుత్వం, టీటీడీ పాలక వర్గం మార్పులు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యావేత్త ఆర్.వి సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, జీవన సంధ్య కార్యదర్శి సి.కృష్ణారావు, ప్రసాద్, జనార్దనరావు ప్రసంగించారు.